

సాంస్కృతిక కార్యక్రమాలు : తెలుగు భాషపై ఉద్దండుల చర్చలు, ప్రసంగాల అనంతరం 'తెలుగు వైభవం' పేరిట 35 నిమిషాల పాటు నృత్య ప్రదర్శన నిర్వహించారు. 'అల్లసాని పెద్దన్న' పేరిట మరో నృత్య కార్యక్రమాన్ని ఆహూతుల మనస్సులు రంజిల్లే విధంగా ప్రదర్శించారు. అనంతరం మధ్యాహ్నం 3.30 నుంచి రాత్రి 7.30 వరకూ శారీరక, మానసిక వికలాంగుల సాంస్కృతిక ప్రదర్శనలు ఆలోచింపజేసే విధంగాను, ఆనంద దాయకంగాను అందరినీ అలరించాయి. రాష్ట్రం నలు మూలల నుంచీ ఈ కార్యక్రమానికి హాజరైన వికలాంగ చిన్నారు డ్యాన్సింగ్, పాటలు తదితర అంశాల్లో తమ ప్రతిభను ప్రదర్శించారు. సాయంత్రం కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన స్పీకర్ సురేష్‌రెడ్డి సాంస్కృతిక కార్యక్రమంలో తమ టాలెంట్‌ను ప్రదర్శించిన ప్రతి ఒక్కరినీ అభినందించారు. ఇలాంటి వారిని గుర్తించి చక్కని కార్యక్రమాలు నిర్వహిస్తున్న తానా సంస్థ సభ్యులను ఆయన ప్రశంసించారు. చిన్నారుల కళా నైపుణ్యాన్ని కళ్ళారా చూసిన సినీ నటుడు మురళీ మోహన్ చలించిపోయారు. అవయవాల లోపం ఉన్నప్పటికీ ఈ చిన్నారులు కనబరిచిన ప్రతిభ మామూలుగా ఉండే అందరికీ ఒక సవాల్‌గా ఉందని ప్రశంసలతో ముంచెత్తారు.

వచ్చే జూలైలో చికాగో నగరంలో జరిగే తానా ద్వైవార్షిక సమావేశాల్లో తమ ప్రతిభను ప్రదర్శించేందుకు కనీసం ఒక్క వికలాంగుల బృందాన్నైనా తీసుకువెళతామని జయరాం కోమటి ప్రకటించారు. ఈ కార్యక్రమంలో ప్రసాద్ తోటకూర, దాము గేదల, సినీనటులు నూతన్ ప్రసాద్, కోట శ్రీనివాసరావు, రాళ్ళపల్లి, గుండు హనుమంతరావు, పోలీస్ అధికారి సి.కె. నాయుడు ప్రసంగించారు. నవనీత కృష్ణ, నాదెళ్ళ గంగాధర్, సతీష్ వేమన, వాసుదేవరెడ్డి, దుర్గ పర్చూరి తదితరులు ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు.